

పశ్చిమ పోరులు.. దేశ వీరులు

దేశం కోసం ప్రాణాలొదిలినా ఫర్వాలేదన్న తెగింపు పశ్చిమ ప్రకాశం యువతను త్రివిధ దళాల దిశగా అడుగులు వేయిస్తోంది. నేడు కార్గిల్ దివస్ సందర్భంగా సైనికుల త్యాగాలపై ప్రత్యేక కథనం - 8లో..



సంక్షోభంలో విద్యారంగం

కూటమి ప్రభుత్వ విధానాలతో విద్యా రంగం సంక్షోభంలో చిక్కుకుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి విమర్శించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 32 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఎయిడెడ్ పోస్టుకు నిర్వహించే పరీక్షకు హాల్‌టికెట్లు

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లపల్లి గ్రామంలోని సీఏ అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఖాళీగా ఉన్న ఎస్జీటీ ఎయిడెడ్ పోస్టు భర్తీ కోసం ఈ నెల 27వ తేదీ నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు అప్లికేషన్ ఐడీ, పుట్టిన తేదీని సీఎస్ఈ పోర్టల్‌లో సమర్పించి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ, నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ అటానమస్ బ్లాక్-4లో నిర్వహించే పరీక్ష కేంద్రాల్లో ఉదయం గం .9.30 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్లతో పాటు ఏదైనా గుర్తింపు కలిగిన ధ్రువపత్రంతో ఒక గంట ముందుగా హాజరు కావాలని కోరారు.

ఏకేయూ పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



పీ.జీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు


ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం పరిధిలోని పీజీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను ఏకేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షలకు మొత్తం 1025 మంది విద్యార్థులకు గాను, 932 మంది హాజరైనట్లు తెలిపారు. వీటిలో 752 మంది విద్యార్థులు 80.7 శాతం మేరకు ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ సీఈ ప్రొఫెసర్ జి.సోమశేఖర, ఏసీఈ డాక్టర్ ఏ.భారతీ దేవి, పీజీ కో ఆర్డినేటర్ (నాన్ కాన్ఫిడెన్షియల్) డాక్టర్ ఆర్.శ్రీనివాస్, పరీక్షల విభాగం పర్యవేక్షకుడు సూడా శివరామ్ తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల నిరసన


ఒంగోలు సిటీ: ఒంగోలు డీఈఓ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించే నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని తమ నిరసన తెలియజేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై, డీ వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. బదిలీలు, పదోన్నతులు పూర్తయి రెండు నెలలైనా ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీలు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. రెండు నెలల నుంచి జీతం రాక ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా బదిలీ అయినా రిలీవర్ రాక అదే స్కూల్లో నిలిచిపోయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న సుమారు 600 ఎస్జీటీ పోస్టుల్లో తాత్కాలికంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనకు కాకుండా, బోధనేతర కార్యక్రమాలు విపరీతంగా పెంచి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు పేరుకుపోయాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కలగా కేంద్రాలు..
దగా కొనుగోళ్లు!

రోజురోజుకూ పతనమవుతున్న ధరలతో పొగాకు రైతు కుదేలవుతున్నాడు. రోజుకో రకంగా ప్రభుత్వం ప్రకటనలు చేస్తూ రైతులను మభ్యపెడుతోంది. వేలం కేంద్రాల్లో కంపెనీలు, పొగాకు బోర్డు అధికారులు కుమ్మక్కై నట్టేట ముంచేస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తూనే ఉంది. జిల్లాలో ఇంత వరకూ ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించకపోవడం గమనార్హం. పొగాకు బోర్డు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం జిల్లాలో ఇప్పటికే 70 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయి. వేలం కేంద్రాల్లో వచ్చిన రేటుకు తెగనమ్ముకున్న రైతులు ఆర్థికంగా కుదేలయ్యారు. తాజాగా ఒక్కో రైతు నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామంటూ మరో ప్రకటన చేయడం దగా చేయడమేనని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జరుగుమల్లి మండలం పంగులూరివారిపాలేనికి చెందిన పిన్నిక శ్రీనివాసులు పొగాకు రైతు. ఈ ఏడాది 22 ఎకరాల్లో పొగాకు సాగు చేశాడు. 4 బ్యారన్ల ద్వారా 160 క్వింటాళ్ల వరకు విక్రయించేందుకు అవకాశం ఉంది. ఇప్పటి వరకు 120 క్వింటాళ్లను విక్రయించాడు. అత్యధికంగా కేజీ రూ.230కి, అత్యల్పంగా కేజీ రూ.130కి అమ్ముకున్నాడు. ఇంకా 40 క్వింటాళ్ల పొగాకు నిల్వ ఉంది. కూటమి ప్రభుత్వం ఒక్కో రైతు వద్ద 20 క్వింటాళ్ల చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తానని ప్రకటించింది. ఇది ముమ్మాటికీ మోసమే, ప్రభుత్వ పెద్దలు ప్రకటనలకే పరిమితం కాకుండా పొగాకు కొనుగోలు చేసి ఆదుకుంటే కొంత వరకైనా ఆర్థిక వెసులుబాటు కల్పించాలని రైతు శ్రీనివాసులు కోరుతున్నాడు. ఈ సంవత్సరం సొంత భూములు కావటంతో పెట్టిన ఖర్చులు మాత్రమే వచ్చాయి. తప్ప ఆదాయం రాలేదు.



- ఉత్తుత్తి ప్రకటనలతో రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం
- నిన్నటి దాకా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేస్తామని ప్రకటన
- జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క మార్క్‌ఫెడ్ కేంద్రం కూడా ఏర్పాటు కాని వైనం
- తాజాగా ఒక్కో రైతు నుంచి 20 క్వింటాళ్ల పొగాకు కొనుగోలు చేస్తామంటున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ప్రకటనపై పెదవి విరుస్తున్న రైతులు
- ఇప్పటికే వేలం కేంద్రాల్లో తక్కువ ధరలకే విక్రయం
- కంపెనీల మాయాజాలంతో తీవ్ర నష్టం
- ఇప్పటి వరకు 76.58 మిలియన్ కేజీలు కొనుగోలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

మోసపు ప్రకటనలతో పొగాకు రైతులను ప్రభుత్వం దగా చేస్తోంది. మద్దతు ధర కోసం రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న రైతులను మభ్య పెట్టేందుకు పొగాకు వేలం ప్రక్రియలో మార్క్‌ఫెడ్ పాల్గొంటుందని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. నెల రోజులు దాటుతున్నా మార్క్‌ఫెడ్ ద్వారా ఒక్క కేజీ కూడా కొనుగోలు చేయలేదు. పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్‌లోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో మొత్తం 11 వేలం కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 2024-25 ఏడాదికి గాను 105.27 మిలియన్ కేజీల పొగాకును అమ్ముకునేందుకు పొగాకు బోర్డు అనుమతిచ్చింది. ఈ మేరకు ఈ ఏడాది మార్చి 10, 19వ తేదీల్లో రెండు దశల్లో అన్ని వేలం కేంద్రాల్లో పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభమైంది. నాలుగేళ్లకు భిన్నంగా ఈ ఏడాది వేలం ప్రారంభం నుంచే రైతుకు మద్దతు ధర కరువైంది. కర్నాటకలో మంచి ధరలు రావడంతో ఇక్కడా అలాగే ఉంటుందని రైతులు ఆశపడ్డారు. అయితే కంపెనీల మాయాజాలం, బోర్డు అధికారుల చేతివాటం, ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి రైతుకు మద్దతు ధర కరువైంది. కేవలం బ్రైట్ గ్రేడ్ పొగాకు మాత్రమే కేజీకి రూ.280 ఇచ్చిన వ్యాపారులు, మిగిలిన గ్రేడ్‌ల ధరలు దారుణంగా తగ్గించేశారు. ఇప్పటి వరకు వచ్చిన సరాసరి ధర చూస్తే కేజీకి కేవలం రూ.241 మాత్రమే. ఈ నేపథ్యంలో మద్దతు ధరలు ఇవ్వాలని రెండు నెలలుగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. వేలం ప్రక్రియను అడ్డుకోవడంతో పాటు, రోడ్లపైకి వచ్చి పొగాకు తగులబెట్టి తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులకు అండగా నిలిచారు. రైతులకు మద్దతు ధరలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వేలంలో పోటీని పెంచేందుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించుతున్నట్లు ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. సరికదా జిల్లాలోని ఏ వేలం కేంద్రంలో కూడా ఇప్పటి మార్క్‌ఫెడ్ తరఫున ఒక్క కేజీ పొగాకును కూడా ప్రభుత్వం తరఫున కొనుగోలు చేయలేదు. వాస్తవానికి గతంలో ఒకసారి పొగాకు మార్కెట్‌లో ధరల సంక్షోభం ఏర్పడినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకును కొనుగోలు చేయించారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి ధరలు అమాంతం పెరిగాయి. నాలుగేళ్లుగా రైతులు లాభాలు చవిచూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు తలకిందులయ్యాయి. ప్రభుత్వం ఉత్తుత్తి ప్రకటనలకే పరిమితమైంది తప్ప రైతులను ఆదుకునే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.



> **ఈ ఏడాది నష్టాలు తప్పవు**
>
> 11 ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఇందుకు రూ.22 లక్షలు పెట్టుబడి అయ్యింది. ఏటా ఒక ఎకరానికి 9 నుంచి 10 క్వింటాళ్ల పంట పండేది. ఈ ఏడాది దిగుబడి కూడా భారీగా తగ్గింది. ఒక్కో బ్యారన్‌కు రూ.4 లక్షల నష్టం వస్తోంది. ఇప్పటి వరకు పొగాకు బోర్డులో రెండు బ్యారన్‌లకు కేవలం 18 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. ఎప్పుడు వేలం కేంద్రానికి వెళ్లినా బేళ్లు తిరస్కరణకు గురౌతున్నాయి. ఇప్పుడు ఒక్కో రైతు వద్ద నుంచి 20 క్వింటాళ్లు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.
>
> – రాయింఢ్ల వెంకట నారాయణ, పొగాకు రైతు, పొందుటూరు గ్రామం, టంగుటూరు మండలం.



> **ప్రభుత్వం పొగాకు రైతులను ఆదుకోవాలి**
>
> 14 ఎకరాల్లో పొగాకును పండించాను. 65 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు వేలంలో 40 క్వింటాళ్ల పొగాకును వ్యాపారులు కొనుగోలు చేశారు. గత సంవత్సరంలో కేజీ రూ.360 పలికిన పొగాకు ఈ ఏడాది రూ.240, రూ.250 పలుకుతోంది. గిట్టుబాటు ధర దక్కకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నా. అధిక సంఖ్యలో బేళ్లు తిరస్కరణకు గురవుతూ అధిక భారం పడుతోంది. జూన్ 11వ తేదీన పొగాకు రైతుల గిట్టుబాటు ధర కోసం పొదిలి వేలం కేంద్రాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సందర్శించారు. ఆ తర్వాత ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ను రంగంలో దించి పొగాకు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు ఏమీ కొనలేదు. అమ్ముడుపోయిన పొగాకులో కూలీలకు ఇవ్వడానికి కూడా డబ్బులు రాలేదు. నా దగ్గర దాదాపు 25 క్వింటాళ్ల పొగాకు ఇంకా అమ్మకానికి ఉంది. దీన్నైనా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలి.
>
> – సురేష్, పొగాకు రైతు, నేతివారిపాలెం

దారుణంగా పడిపోతున్న సరాసరి ధరలు



కొండపి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న వేలం అధికారి

వేలం కేంద్రాల్లో రైతులకు మద్దతు ధరలు రాకపోగా రోజు రోజుకూ దిగజారుతున్నాయి. ప్రారంభంలో బ్రైట్ పొగాకుకు ఇచ్చిన ధరలే ఇప్పటికీ ఇస్తున్నారు. ఇక లోగ్రేడ్ పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేసే నాథుడే కరువయ్యాడు. గతేడాదికి ఈ ఏడాదికి సరాసరి ధరలను పోల్చి చూస్తే భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. గతేడాది కేజీ పొగాకు సరాసరి ధర రూ.360 వరకు వస్తే, ప్రస్తుతం అది రూ.241 మాత్రమే ఉండడం గమనార్హం. అంటే కేజీ పొగాకుకు రూ.119లను రైతులు నష్టపోతున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సరే ప్రభుత్వంలో కదలిక రావడం లేదు. తమను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్భాటపు ప్రకటనలతో కాలయాపన..

పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభమై దాదాపు నాలుగు నెలల కావస్తోంది. 11 వేలం కేంద్రాల పరిధిలో అధికారిక, అనధికారి పొగాకు ఉత్పత్తి కలుపుకుని 142 మిలియన్ కేజీలు ఉండొచ్చని అంచనా. దీనిలో ఇప్పటికే 76.58 మిలియన్ కేజీల పొగాకును రైతులు అమ్ముకున్నారు. అంటే దాదాపు 50 శాతానికి పైగా రైతులు ఉత్పత్తులను అరకొర ధరలకే విక్రయించారు. అయినా సరే ఇప్పటికీ ప్రభుత్వం మద్దతు ధరలు కల్పించలేదు. తాజాగా ఒక్కో రైతు నుంచి 20 క్వింటాళ్లు కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. అయితే తక్కువ పండించిన రైతులు ఇప్పటికే తమ వద్ద ఉన్న పొగాకును తక్కువ ధరలకు తెగనమ్ముకున్నారు. ప్రభుత్వం ఇప్పుడు వేలం ప్రక్రియలోకి వచ్చినా సగం మంది రైతులకు కూడా ప్రయోజనం ఉండేలా కనిపించడం లేదు. ఇలా రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం మోసపు మాటలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వర్క్ అవుట్ సోర్సింగ్ చర్యలు ఆపాలి

- మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఒంగోలు సిటీ: మున్సిపల్ కార్మికుల పొట్టగొట్టి కాంట్రాక్టర్ల బొజ్జ నింపే వర్క్ అవుట్ సోర్సింగ్ చర్యలు ఆపాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒంగోలు మున్సిపల్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం శుక్రవారం సీఐటీయూ ప్రకాశం జిల్లా కార్యాలయంలో జీ నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా కె.ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూలై 12 నుంచి ఇంజినీరింగ్ కార్మికులు, 16వ తేదీ నుంచి పారిశుద్ధ్య కార్మికులు పది రోజుల పాటు సమ్మె చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమంపై ఉక్కుపాదం మోపాలని ప్రయత్నించిందన్నారు. కార్మికుల ఐక్య పోరాటం వల్ల కొంతమేర ప్రభుత్వం దిగివచ్చి ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచటం, పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాల జీవోలు, సమ్మెకాలపు వేతనం ఇస్తానని 22వ తేదీ మున్సిపల్ శాఖ మంత్రి దగ్గర జరిగిన చర్చల్లో మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ఆగస్టు 5 తర్వాత రిలే నిరాహార దీక్షలు, అప్పటికీ కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థలో రెండు డివిజన్‌ల పరిధిలో వర్క్ అవుట్‌సోర్సింగ్ విధానాన్ని తీసుకొచ్చి చాప కింద నీరు లాగా ఆప్కాస్ ను ఎత్తేసి మళ్లీ లోకల్ ఏజెన్సీలకు ఇవ్వటానికి రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిందని తెలిపారు. టెండర్లు పిలిచారని, వెంటనే వాటిని రద్దు చేయాలని నెల్లూరులోని మున్సిపల్ కార్మికులు ఈనెల 12వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారన్నారు. ఈ విధానాన్ని రాష్ట్రం మొత్తం అమలు చేయడానికి ప్రయత్నం మొదలుపెట్టిందన్నారు. వెంటనే వర్క్‌అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు మరో పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నేను మారిపోయాను అన్న చంద్రబాబు.. మళ్లీ మన రాష్ట్రంలో ప్రపంచీకరణ మొదలుపెట్టారని, స్మార్ట్ మీటర్లు, కరెంటు బిల్లులను విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. వెంటనే ఈ విధానాలు ఆపాలని, లేదంటే కార్మికులు ఉద్యమబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం, కోశాధికారి జ్యోతి బసు, సీఐటీయూ నగర కార్యదర్శి, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సామ్రాజ్యం, యు.రత్నకుమారి, యూనియన్ నగర జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు, టి.విజయమ్మ, ఆనంద్, వై రవి, ఎం బాబు, జేమ్స్, కె.వంశీ, మోహన్ రావు, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మత్స్య సంపద పెంచేలా చర్యలు

- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లాలో మత్స్య సంపదను పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన మత్స్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, బీసీ కార్పొరేషన్ అధికారులతో కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి లక్ష్యాలను సాధించడానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద గుర్తించిన అన్ని ప్రజా నీటి వనరుల్లో క్యాప్టివ్ సీడ్ నర్సరీలను ఏర్పాటు చేయడానికి మత్స్య శాఖ, జిల్లా నీటి యాజ్యమాన్య సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు నిర్దేశించిన పథకాల లక్ష్య సాధనకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, బీసీ కార్పొరేషన్ అధికారులు తమ వంతు తోడ్పాటు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, డీఆర్డీఏ, డ్వామా పీడీలు నారాయణ, జోసెఫ్ కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ ముప్పూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో శానిటేషన్ అధ్వానం

- వినియోగదారుల రక్షణ సంఘ సమావేశంలో జేసీకి సభ్యుల ఫిర్యాదు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో శానిటేషన్ అధ్వానంగా ఉందని వినియోగదారుల రక్షణ సంఘం(డీసీపీసీ) సభ్యులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జేసీ ఆర్.గోపాల కృష్ణ అధ్యక్షతన శుక్రవారం ఆయన ఛాంబర్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీపీసీ సభ్యులు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో శానిటేషన్ అధ్వానంగా ఉందని, మరుగుదొడ్ల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని, కొన్ని చోట్ల మునిసిపల్ ఏరియాల్లో శానిటేషన్ బాగుండటం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే కొన్ని చోట్ల గుంతలు ఎక్కువగా ఉండటం వలన ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. కరెంట్ వైర్లు కిందకు వేలాడుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఒంగోలు నగరంలో అన్ని ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. వృద్ధులు, చిన్నారులను కరిచి గాయాల పాలు చేస్తున్నాయని చెప్పారు. ఒంగోలు నగరంలో కోతులు బెడద కూడా ఎక్కువగా ఉందన్నారు. ఒంగోలులో ప్రజల సౌకర్యార్థం సిటీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జేసీ గోపాల కృష్ణ స్పందిస్తూ వెంటనే ఒంగోలు, గిద్దలూరు, కనిగిరి మునిసిపల్ కమిషనర్లతో మాట్లాడి వారం రోజుల లోపల శానిటేషన్, గుంతలు కూడా సరిచేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశిస్తామన్నారు. కరెంట్ వైర్లు కిందకు వేలాడుతున్నందున వెంట సరిచేయాల్సిందిగా ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఏప్రిల్ నుంచి నెలలో ఒకరోజు ఎన్‌ఫోర్స్‌మెంట్ డేగా ప్రకటిస్తున్నారని, జిల్లాలో ప్రతి నెలా ఆ రోజు 9, 10 శాఖల అధికారులతో తనిఖీలు చేస్తామన్నారు. సంబంధిత తహశీల్దారు, ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ తహశీల్దార్లు, ఎలక్ట్రికల్ ఏఈ, ఫైర్ డిపార్ట్‌మెంట్, లీగల్ మెట్రోలజీ, ఫుడ్ సేఫ్టీ, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరుతో పాటు జిల్లా సంయుక్త కలెక్టర్ కూడా తనిఖీల్లో పాల్గొంటారన్నారు. తనిఖీల్లో డీసీపీసీ సభ్యులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. సమావేశాలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ,, డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ సుశీల, అసిస్టెంట్ కమిషనర్ లీగల్ మెట్రోలజీ స్వర్ణ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మహ్మద్ షంషేర్ ఖాన్, జిల్లా వినియోగదారుల సంఘం యం.నాగేశ్వరరావు, ఏనుగుల సురేష్, ఓ.సిహెచ్.నరసింహులు, వీరారెడ్డి, ప్రసాద్, మాధవ, కృష్ణరావు, బాలకృష్ణ, ఐ.నాగేంద్రరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాల కృష్ణ, పక్కన డీఎస్ఓ పద్మశ్రీ

కేపీఐపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన కేపీఐ (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్)పై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం సమగ్రంగా పర్యవేక్షణ ఉంచాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఆయా అంశాల్లో పురోగతిని తాను కూడా ప్రతివారం సమీక్షిస్తానని చెప్పారు. కేపీఐ లక్ష్యాలు-పురోగతిపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం ప్రకాశం భవనంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర-2047 కోసం ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశాలను గుర్తించి వీటిలో పురోగతి కోసం కేపీఐలను ప్రభుత్వం ఎంచుకున్నట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే వీటి కోసం లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి రాష్ట్ర స్థాయిలో అన్ని శాఖల ఉన్నతాధికారులకు వీటిని తెలియజేస్తారని, అనంతరం అక్కడ నుంచి జిల్లాలోని ఉన్నతాధికారులకు శాఖల వారీగా ఇవి వస్తాయని, వీటిని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆయా లక్ష్యాలను కాలానుగుణంగా (పీరియాడికల్) చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చూడాలని చెప్పారు. మండల స్థాయి అధికారులు చేస్తున్న పనులు, సాధిస్తున్న పురోగతిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్‌లో రియల్ టైంలో ఈ వివరాలు కనిపిస్తూ ఉంటాయన్నారు.

ఫైళ్లు సైతం

పరిపాలనలో సాంకేతిక వినియోగానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం, ఇందులో భాగంగా శాఖల వారీగా ఆయా కార్యాలయాలకు సంబంధించిన జీవోలు, సర్క్యులర్లు, ఇతర కీలక ఫైళ్లను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా చర్యలు చేపట్టిందని కలెక్టర్ చెప్పారు. వీటిని ఈపీటీఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైటులో అప్‌లోడ్ చేయాలని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ, డీఆర్ఓ బి.చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కేపీఐపై సమీక్షలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన జేసీ, డీఆర్ఓలు

దేశభక్తిని గుండెలనిండా నింపుకొని సరిహద్దుల్లో పహారా కాస్తున్న సైనికుల పరాక్రమం మరెందరిలోనో స్ఫూర్తిని రగిలించే అనుభవ పాఠం. తూటాలు దేహాన్ని తూట్లు పొడుస్తున్నా వెరవకుండా శత్రువులతో పోరాడి వీరమరణం పొందిన సైనికుల సాహసం భావితరాల్లో దేశభక్తిని రగిలించే ఆయుధం. రణభూమిలో గర్జించాలన్న ఉత్సాహం.. దేశం కోసం ప్రాణాలొదిలినా ఫర్వాలేదన్న తెగింపు పశ్చిమ ప్రకాశం యువతను త్రివిధ దళాల దిశగా అడుగులు వేయిస్తోంది. నేడు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సైనికుల త్యాగాలపై ప్రత్యేక కథనం..

దేశ వీరులు పశ్చిమ పౌరులు



కంభం: భారత త్రివిధ దళాల్లో జిల్లాకు చెందిన వేలాది మంది ప్రాణాలు పణంగా పెట్టి దేశ రక్షణ విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు నియోజకవర్గం నుంచి యువత ఆర్మీలో చేరేందుకు అమితాసక్తి కనబరుస్తుండటం విశేషం. దాయాది దేశమైన పాకిస్తాన్‌తోపాటు చైనాతో జరిగిన యుద్ధాలు, కవ్వింపు చర్యలు, విధి నిర్వహణలో ఎదురైన ప్రమాదాల్లో జిల్లాకు చెందిన సైనికులు 36 మంది సైనికులు అశువులుబాశారు. అమరుల్లో గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన 20 మంది సైనికులు ఉండగా, ఒక్క కంభం మండలానికే చెందిన వారు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. 25 ఏళ్ల క్రితం జూలై 26వ తేదీన కార్గిల్ యుద్ధంలో భారత్ విజయ పతాకం ఎగురవేసింది. పాక్ మూకలను తిప్పికొట్టే క్రమంలో వందలాది మంది భారత సైనికులు వీర మరణం పొందగా వారిలో కంభం మండలం ఎల్.కోట గ్రామానికి చెందిన జి.శ్రీనివాసులు ఉన్నారు.

మృత్యువుకే సవాల్

పశ్చిమ ప్రకాశం వాసులు సైన్యంలో చేరడానికి ప్రధాన కారణం ఇక్కడి వారి పూర్వీకులే. మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో గిద్దలూరు ప్రాంత వాసులు ఎక్కువ మంది పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు.. ఇలా ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందుతూ సైన్యంలో చేరే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారని మాజీసైనికులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న అగ్నివీర్ సైనిక నియామకాల్లో సైతం పశ్చిమ ప్రకాశం నుంచి వందలాది మంది యువకులు చేరి దేశ సేవలో పాలు పంచుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 13 వేల మంది మాజీ సైనికులు, 5 వేల మంది సైనికులుండగా ఒక్క గిద్దలూరు నియోజకవర్గం నుంచే 10 వేలకు పైగా మాజీ సైనికులు, 4 వేల మంది సైనికులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

- భరతమాత సేవలో ముందున్న పశ్చిమ ప్రకాశం సైనికులు
- వివిధ యుద్ధాలు, ప్రమాదాల్లో అమరులైన 36 మంది జవాన్లు
- జిల్లాలో సైనికులు 5 వేల మంది, విశ్రాంత సైనికులు 13 వేల మందికి పైగా..
- గిద్దలూరు నియోజకవర్గంలోనే సుమారు 10 వేల మాజీ జవాన్లు, 4 వేలకు పైగా సోల్జర్లు
- సైనిక కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వాలు చొరవచూపాలని విజ్ఞప్తి

సంక్షేమానికి చొరవచూపాలి

పోలీసులతో కలిసి మాజీ సైనికులు ఎన్నికల విధుల్లో పాలుపంచుకుంటున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఈ క్రమంలోనే సైనికులు తమ కుటుంబాల సంక్షేమానికి చొరవ చూపాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. 20 ఏళ్లకు పైగా సైన్యంలో పనిచేసి వచ్చిన వారికి 5 సెంట్ల నివేశన స్థలం, 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని కోరుతున్నా నిరాశే ఎదురవుతోంది. పశ్చిమ ప్రకాశంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడంతోపాటు పెన్షనర్లకు ఉపయోగకరంగా ఉండేలా స్పర్శ్ కేంద్రాన్ని నెలకొల్పాలని, రేషన్ కార్డు స్థానంలో డిఫెన్స్ వెల్ఫేర్ కార్డు అందించాని సైనికులు, మాజీ సైనికులు డిమాండ్ చేస్తున్నారు. మాజీ సైనికుల కార్యాలయానికి స్థలం మంజూరు చేయడంతోపాటు రైల్వే దొనకొండ ప్రాంతంలో ఆర్మీ ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కంభం మండల మాజీ సైనికులను జ్ఞాపికతో సత్కరిస్తున్న కలెక్టర్(ఫైల్)

కార్గిల్ యుద్ధంలో మేము సైతం

మార్కాపురం/గిద్దలూరు రూరల్: పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరుకు చెందిన మాజీ సైనికులు కార్గిల్ యుద్ధ పరిస్థితులను గుర్తు చేస్తూ నాటి సైనికుల పోరాటాన్ని, త్యాగాలను వివరించారు. తాను కార్గిల్ వార్‌లో పాల్గొన్నందుకు గర్విస్తున్నానని చెబుతున్నారు మార్కాపురం ఆకాశవాణి కేంద్రం సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మందా జాన్సన్. గిద్దలూరు పట్టణంలోని ఏబీఎం పాలేనికి చెందిన జాన్సన్ నాడు మద్రాసు రెజిమెంట్‌లో డీడీ నాయక్ హోదాలో ఉన్నారు. కార్గిల్ వార్‌లో భాగంగా జమ్మూకాశ్మీర్‌లోని బటాలిక్ సెక్టార్‌లో పాక్ సైనికులపై పోరాడిన తీరును గుర్తుచేసుకున్నారు. భీకర పోరులో తన సహచరులు నలుగురు చనిపోగా, మరికొందరు గాయపడ్డారని జాన్సన్ తెలిపారు. కార్గిల్ యుద్ధం నాటి అనుభవాలను ఎన్నటికీ మరువలేనంటున్నారు గిద్దలూరు మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామానికి చెందిన కొమ్మునూరి వీరయ్య. కార్గిల్ పోరాటంలో వీరయ్య కుడి కాలుకు గాయాలయ్యాయి. దేశం కోసం పోరాడే అవకాశం తనకు దక్కినందుకు గర్వంగా ఉందని చెబుతున్నారాయన.



జాన్సన్, మాజీ సైనికుడు



వీరయ్య, మాజీ సైనికుడు



జవాన్ సుబ్బయ్య భార్యకు జాతీయ జెండా అందిస్తున్న ఆర్మీ అధికారులు(ఫైల్)



ఎం.రామకృష్ణారెడ్డి ఎస్.శ్రీనివాసులు వి.సుబ్బయ్య పి.వెంకటనారాయణ జి.శ్రీనివాసులు

అమరులారా వందనం

- గత ఏడాది జూన్‌లో తూర్పు లడఖ్ సమీపంలో సైనిక విన్యాసాలు చేస్తుండగా యుద్ధ ట్యాంక్ నీటిలో కొట్టుకుపోయి ఐదుగురు జవాన్లు మరణించారు. వారిలో రాచర్ల మండలానికి చెందిన జేసీఓ ముత్తుముల రామకృష్ణారెడ్డి ఉన్నారు.
- గిద్దలూరు మండలం కిష్టంశెట్టిపల్లి గ్రామానికి చెందిన సంగిరెడ్డి సంజీవరెడ్డి నాలుగేళ్ల క్రితం సిక్కింలో మంచు కొండల చరియలు పడి మృతి చెందారు.
- గతేడాది డిసెంబర్‌లో కంభం మండలం రావిపాడుకు చెందిన వరికుంట్ల సుబ్బయ్య జమ్మూలోని పూంచ్ సెక్టార్‌లో కాపలా కాస్తున్న సమయంలో మందుపాతర పేలి మృతి చెందారు.
- కంభంకు చెందిన నంద్యాల శ్రీనివాసులు 2004లో శ్రీనగర్‌లో జరిగిన ఆపరేషన్ రక్షక్‌లో అమరుడయ్యారు. ఆయన మరణించే నాటికి భార్య వకులాదేవి 6 నెలల గర్భిణి. నంద్యాల శ్రీనివాసులుకు మరణాంతరం విశిష్ట సేవా మెడల్ దక్కింది.
- కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామానికి చెందిన పత్తి వెంకట నారాయణ 1988లో శ్రీలంకలో చేపట్టిన ఆపరేషన్ పవన్‌లో పాల్గొన్నారు. యుద్ధభూమిలో వీరమరణం పొందిన ఆయనకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.
- కంభం మండలం తురిమెళ్లకు చెందిన సీహెచ్ రంగస్వామి 1962లో చైనా యుద్ధంలో, ఎం.రంగారెడ్డి 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందారు. కంభం పట్టణానికి చెందిన జి.గాలెయ్య 2006లో ఆపరేషన్ రక్షక్‌లో, ఎల్ కోట గ్రామానికి చెందిన జి.శ్రీనివాసులు 1999 కార్గిల్ యుద్ధంలో తుది శ్వాస విడిచారు.

ఆర్మీ సెలక్షన్‌లో జిల్లా కోటా పెంచాలి



పశ్చిమ ప్రకాశం యువత ఆర్మీలో చేరేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతారు. సెలక్షన్‌లో జిల్లా కోటా పెంచితే మరింత మంది సైన్యంలో చేరే అవకాశం ఉంటుంది. అగ్నివీర్‌లో ప్రస్తుతం 25 శాతం మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తున్నారు. అలా కాకుండా కనీసం 50 శాతం మందిని రెగ్యులర్ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– శెట్టెం వేణుగోపాల్‌రావు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు, కంభం

దేశం కోసం పనిచేస్తుండటం గర్వంగా ఉంది



28 ఏళ్ల క్రితం ఆర్మీలో చేరా. ప్రస్తుతం సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నా. 1999లో కార్గిల్ యుద్ధంతో పాటు ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొనడం గర్వంగా భావిస్తున్నా. దేశం కోసం పనిచేయడం ఎంతో సంతృప్తినిస్తుంది.

– చట్టి రమణ, సుబేదార్ అర్ధవీడు మండలం

సెంట్రల్ స్కూల్ ఏర్పాటు చేయాలి



గిద్దలూరు నియోజకవర్గంలో మాజీ సైనికులు, సైనికుల పిల్లల కోసం సైనిక్ స్కూల్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మాజీ సైనికుల భవనం నిర్మించుకునేందుకు కంభంలో స్థలం మంజూరు చేయాలి.

– షేక్ వలి, రిటైర్డ్ ఆర్నల్ కెప్టెన్, కంభం

స్కూటర్‌ను ఢీకొట్టిన క్యాష్ ట్రక్



తీవ్రంగా గాయపడిన సుబ్బారెడ్డి, సుశీల

కొనకనమిట్ల: రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఒంగోలు–గిద్దలూరు హైవేపై చినారికట్ల జంక్షన్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. చినారికట్లకు చెందిన సోము సుబ్బారెడ్డి, సుశీల దంపతులు తమ పొలం నుంచి స్కూటర్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ఒంగోలు నుంచి వస్తున్న ఓ క్యాష్ పికప్ ట్రక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సుబ్బారెడ్డి, సుశీల దంపతులకు పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ప్రభాకరరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బ్యాంక్ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షోభంలో విద్యారంగం

- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వం
- పేరుకుపోతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- విద్యార్థుల పక్షాన పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధం
- మేధావులు, విద్యార్థి సంఘాలు కలిసిరావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి పిలుపు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో విద్యారంగంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఒంగోలు నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం దాదాపు 18 లక్షల మంది విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఫలితంగా ఒక తరం విద్యార్థులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ పోరాటం చేయనుందని ప్రకటించారు. ఇది కేవలం రాజకీయపరమైనది కాదని, రాష్ట్ర భవిష్యత్, విద్యార్థుల భవితకు సంబంధించిందని, రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు, మేధావులు, ఉద్యోగ సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు పలకాలని కోరారు. ప్రభుత్వం మెడలు వంచి విద్యర్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించేలా ఉద్యమం చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ప్రైవేటు కళాశాలల్లో పీజీ చదువుతున్న విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను రోడ్డున పడేశాడని ధ్వజమెత్తారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి

సకల శాఖల మంత్రిగా ఉన్న లోకేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన వారు, ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారన్నారు. ఇంటర్ తెలంగాణలో చదివి ఇక్కడ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టడం సరికాదన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్...

ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, తదితర ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిదని కేవీ రమణారెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దిగ్విజయంగా అమలు చేశారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈ పథకానికి గ్రహణం పట్టించారని ధ్వజమెత్తారు. దాదాపు రూ.1700 కోట్లు బకాయిలు పెట్టారని ఆరోపించారు. ఫలితంగా పేద విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన బకాయిలను 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చారన్నారు. అలాగే క్రమం తప్పకుండా విద్యా దీవెన, వసతి దీవెన కార్యక్రమాల ద్వారా నిధులు ఇచ్చి పేద విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య భారం కాకుండా చూశారన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటుకు సంబంధించి ఆరు క్వార్టర్లు బకాయిలు పెట్టిన ఘనత చంద్రబాబుదేనని విమర్శించారు. కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫలితంగా కళాశాల నిర్వహణ భారంగా మారడంతో నాణ్యమైన విద్య అందించేందుకు యాజమాన్యాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. తమ బిడ్డల భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. కొంచెం డబ్బులున్న వారు తమ పిల్లలను పొరుగు రాష్ట్రాల్లోని ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరుస్తున్నారన్నారు. ఫలితంగా ఉన్నత విద్యలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్, రాష్ట్ర ఇంటలెక్చువల్ ప్రధాన కార్యదర్శి రొండా అంజిరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్నాటి రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో వెనుకబడిన జిల్లా



మాట్లాడుతున్న రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరామప్రసాదు

ఒంగోలు సబర్బన్: వాహన తనిఖీల్లో ప్రకాశం జిల్లా రవాణా శాఖ అధికారులు వెనుకబడ్డారని గుంటూరు రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్.శివరామప్రసాదు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక వెంగముక్కలపాలెం రోడ్డులోని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత జిల్లాలోని రవాణా శాఖ డీటీసీ, ఆర్‌టీఓలు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రహదారి భద్రతా నిబంధనల మేరకు భారీ, అతి భారీ ట్రాలీలు, టర్బో లారీలు, టిప్పర్లు సరుకు రవాణా చేసుకోవాలని, ఓవర్ లోడుతో రోడ్డు మీదకు వస్తే కేసులు రాసి పెనాల్టీలు విధిస్తామని హెచ్చరించారు. ప్రకాశం జిల్లాలో రవాణా అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు తగ్గాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా డీటీసీ ఆర్.సుశీల, ఆర్‌టీఓలు కలిసి గ్రూప్ చెకింగ్‌లు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. 24/7 తనిఖీ అధికారులు విధుల్లో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పామన్నారు. జిల్లా వ్యాప్తంగా లైఫ్ ట్యాక్స్ రాబడి దాదాపు రూ.3 కోట్లకుపైగా మైనస్‌లో ఉందన్నారు. వాహనాల విక్రయాల షోరూముల వద్ద నుంచే లైఫ్ ట్యాక్స్‌లు రావాల్సి ఉందని, మరి ఎక్కడ లోపం జరిగిందో ఎగ్జిక్యూటివ్ అధికారులతో తనిఖీలు చేయిస్తామని చెప్పారు. షోరూమ్‌ల నిర్వాహకులు లైఫ్ ట్యాక్సులు సక్రమంగా కట్టకపోవటం వలనే వాహనాల అమ్మకాలకు, లైఫ్ ట్యాక్సుకు తేడా ఉందన్నారు. అదేవిధంగా క్వార్టర్లీ వాహన ట్యాక్సులు రూ.2 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. రహదారుల మీద తనిఖీలు లేనందువలనే మూడు నెలలకు ఒకసారి కట్టాల్సిన ట్యాక్స్‌లు కట్టకుండా రోడ్ల మీద వాహనాలు తిరుగుతున్నాయన్నారు. అందుకోసం రెండు మండలాలకు ఒక మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 100 శాతం రెవెన్యూ వసూలయ్యేలా డీటీసీ ఆర్.సుశీలను ఆదేశించామన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల, మార్కాపురం ఆర్‌టీఓ వై.శ్రీచందన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్టు

ఒంగోలు సిటీ: నగర శివారులో పెట్రోల్ పోసి యువకుడిని తగలబెట్టిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. బోయపాటి ద్రోణాచలం అలియాస్ రాజ (30) హత్యకేసులో పాతపాటి శ్రీహరి, గందేటి గణేష్‌ను అరెస్టు చేశామని చెప్పారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... బోడపాటి ద్రోణాచలం అలియాస్ రాజ (30) కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ముక్తినూతలపాడులో ఉంటున్న శ్రీహరి అనే వ్యక్తి తన మేనకోడలు వెంటపడుతుండడాన్ని ద్రోణాచలం గమనించాడు. పద్ధతి మార్చుకోవాలని శ్రీహరిని హెచ్చరించాడు. శ్రీహరి అవమానంగా భావించి ద్రోణాచలాన్ని మట్టుబెట్టాలని పథకం రచించాడు. తన స్నేహితుడు గందేటి గణేష్‌కు ఆ విషయం చెప్పాడు. దానికి అతను కూడా అంగీకరించాడు. బెంగళూరులో డ్రైవర్‌గా ఉన్న ద్రోణాచలం ముక్తినూతలపాడు వచ్చాడని తెలుసుకున్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం గత నెల 6వ తేదీ అతనిని హత్య చేసేందుకు సిద్ధమయ్యారు. మద్యం సేవించేందుకు రావాలని వారు ద్రోణాచలాన్ని పిలిచారు. ముక్తినూతలపాడు గ్రామ చివర్లో ఉన్న ధరణి వెంచర్‌లోకి తీసుకెళ్లి పూటుగా మద్యం తాగించారు. మద్యం మత్తులో కిందపడిపోయిన ద్రోణాచలంపై ముందుగానే తెచ్చి ఉంచిన పెట్రోలు పోసి నిప్పటించి హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి వారు పరారయ్యారు. శుక్రవారం కొత్తపట్నం రోడ్డులో కొప్పోలు ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డులో నిందితులు ఉండగా, ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ అరెస్టు చేశారు.

దేవస్థాన భూములను ఆక్రమిస్తే చర్యలు

- దేవదాయశాఖ జిల్లా అధికారి పానకాలరావు
- ఆలయ భూముల్లో ఆక్రమణలు, చెట్ల తొలగింపు



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న దేవదాయశాఖ జిల్లా అధికారి పానకాలరావు, ఈఓ



దేవస్థాన భూముల్లో ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీలు

పామూరు: దేవస్థాన భూముల్లో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ జిల్లా అధికారి పానకాలరావు, ఈఓ శ్రీగిరిరాజ నరసింహబాబు హెచ్చరించారు. పామూరు మండల కేంద్రంలోని నెల్లూరు రోడ్డు, విరువూరు రోడ్డులో సర్వేనంబర్లు 441/1, 2, 3, 442/1, 2, 3లోని 28 ఎకరాలు, సర్వే నంబర్ 256/2లోని 29.33 ఎకరాల భూమిని శుక్రవారం పరిశీలించారు. శ్రీమదన వేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయ భూములను కొందరు ఆక్రమించి గుడిసెలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా పరిశీలించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థాన భూముల్లో ఎలా నిర్మాణాలు చేపట్టారని నిలదీశారు. కొన్నిచోట్ల ఆక్రమణలు తొలగించారు. అదేవిధంగా ఆలయ భూముల్లో ఉన్న చిల్లచెట్లను తొలగించారు. గతంలో 32 కుటుంబాలే ఉండగా, నేడు 90 కుటుంబాల వరకూ ఆక్రమించారని, తక్షణమే ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించకుంటే తామే జేసీబీలతో తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై టి.కిషోర్‌బాబు, కేవీ రమణయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, బండ్లా నారాయణ పాల్గొన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: బాస్కెట్‌బాల్ జిల్లా జట్లను ఈ నెల 27వ తేదీ కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఎంపిక చేయనున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలేటి రవీంద్ర, తొట్టెంపూడి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని బాలబాలికలు 2007 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. హాజరుకాదలచుకున్న వారు వయస్సు ధ్రువీకరణ పత్రంతో రావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 14 నుంచి 17వ తేదీ వరకు పిఠాపురంలో నిర్వహించనున్న పదో జూనియర్ బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

గంజాయి, చెయిన్ స్నాచింగ్ ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, వెనుకవైపు ముసుగుల్లో నిందితులు

ఒంగోలు సిటీ: గంజాయి విక్రయాలు, చెయిన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్టు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. రూ.30 వేలు విలువచేసే గంజాయి, రూ.14.50 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. సింగరాయకొండకు చెందిన గుంజి నరసింహారావు గంజాయికి అలవాటుపడ్డాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన గంజాయి విక్రయదారులు మిలన్ దాస్, శంకర్ పటేకర్, హడిలతో పరిచయం పెంచుకున్నాడు. వారి వద్ద నుంచి కొద్ది మొత్తంలో గంజాయి తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఒంగోలులో విక్రయించి డబ్బు సంపాదించాలని నరసింహారావు ఆశపడ్డాడు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులకు వెళ్లి అక్కడ వారికి కొంత మొత్తం డబ్బు చెల్లించి గంజాయి తీసుకునేవాడు. అక్కడి నుంచి వచ్చేటప్పుడు కొంత దూరం రైలు, మరికొంత దూరం బస్సుల్లో ప్రయాణించి ఒంగోలు చేరుకునేవాడు. ఇంటికి వెళ్లి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసేవాడు. వాటిని ఒంగోలు నగరంలోని కాలేజీల వద్ద ప్యాకెట్ రూ.300 నుంచి రూ.500 వరకూ విక్రయించేవాడు. వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవాడు. ఈ క్రమంలో నరసింహారావుకు ఒంగోలుకు చెందిన గంజాయి విక్రయదారులు గోపాలకృష్ణ, అల్తాఫ్ పరిచయమయ్యారు. నరసింహారావు తెచ్చిన గంజాయిలో వారికి కూడా కొంత ఇచ్చేవాడు. వారు కూడా ఆ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్మేవారు. అల్తాఫ్ స్నేహితులు నగరానికి చెందిన ఎనుగంటి కార్తీక్, మోట నవీన్, ఆవులమంద అంకబాబు, ఏకాంబరం నరేంద్ర, కుందురు ప్రవీణ్, తన్నీరు అఖిల్, షేక్ కృపారావులు కూడా గంజాయి ప్యాకెట్లు విక్రయించేవారు. వచ్చిన లాభాన్ని అంతా పంచుకునేవారు. ఈ క్రమంలో గంజాయిని తెచ్చేందుకు నరసింహారావు వైజాగ్ వెళ్లాడు. అక్కడి నుంచి ఆంధ్రా, ఒడిశా సరిహద్దుకు వెళ్లి ఒక కేజీ గంజాయి తీసుకొచ్చి ఇంట్లో దాచిపెట్టాడు. తెచ్చిన గంజాయిని గోపాలకృష్ణ, అల్తాఫ్‌లకు ఇచ్చేందుకు ముక్తినూతలపాడు గ్రామ శివారులోని ధరణి వెంచర్ వద్దకు వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న ఒంగోలు తాలూకా పోలీసులు మాటు వేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.30 వేలు ఉంటుంది. వీరిని విచారించగా ఈ ముఠాలో సభ్యుడిగా ఉన్న షేక్ కృపారావు మహిళల మెడల్లో చెయిన్లు అపహరించేవాడని గుర్తించారు. అతని వద్ద నుంచి రూ.14.50 లక్షల విలువైన 145 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన ముఠా పరారీలో ఉందని, వారిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.